

బుక్ ఆవిష్కరించిన శిఖా గోయెల్

'క్యాండిల్ ఇన్ ది విండ్' బుక్ ఆవిష్కరణ

హైటెక్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ట్రూ క్రైం రచయిత శర్మిష్ఠా షెనాయ్ రచించిన 'క్యాండిల్ ఇన్ ది విండ్' పుస్తకాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరి డీజీ శిఖా గోయెల్ ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉషారామన్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

బ్రాహ్మణవాడిలో సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న డా.కోట నీలిమ

బేగంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ బిల్డర్ భవన వ్యర్థాలను డ్రైనేజీలోకి వదలడంతో పాటు కుందన్‌బాగ్ నుంచి భారీగా వస్తున్న మురుగునీరుతో కొన్ని నెలలుగా బ్రాహ్మణవాడి మురుగుమయంగా మారింది. దీనిని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ శనివారం పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు సమాచారం ఇచ్చినా వారు రాకపోవడంతో ఆమె స్థానికులతో కలిసి డ్రైనేజీ పొంగుతోన్న లేన్ నెంబర్.3లో సత్యాగ్రహ దీక్ష చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆమె ప్రజలతోనే గడిపారు. విషయం తెలుసుకున్న హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు దీక్ష వద్దకు చేరుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని ఆమె భీష్మించుకుని కూర్చున్నారు. బిల్డర్ నిర్మిస్తున్న భవనాల వద్ద కొలతలు నిర్వహించిన అధికారులు ఆరు అడుగల రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లు గుర్తించారు. ఎక్స్‌కవేటర్ తెప్పించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రహరీ కూల్చివేయడంతో పాటు ముప్పై అడుగుల రోడ్డు మార్కింగ్ చేశారు. అనంతరం వాటర్ వర్క్స్ జీఎం వినోద్‌కుమార్, డీజీఎం ఆశిష్, మేనేజర్ రామేశ్వరరావు అక్కడికి చేరుకుని ఆమెతో మాట్లాడారు. డ్రైనేజీలోకి సిమెంట్ రాళ్లు వచ్చినా ఎందుకు యాక్షన్ తీసుకోలేదని వారిని ఆమె ప్రశ్నించారు. వెంటనే సంబంధిత బిల్డర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఇక్కడ నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆమె దీక్షను విరమించారు. దీక్షలో నాయకులు గౌరీ శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, హనిఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, స్థానికులు సుభాష్ ముదిరాజ్, అంజిబాబు, పవన్, అశోక్ పాల్గొన్నారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు

బేగంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్ రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్‌లో శనివారం పలువురు వాహనదారులు పెట్రోల్ పోసుకున్నారు. అనంతరం కొంతదూరం వెళ్లగానే వాహనం ఆగిపోతుంది. దీంతో వారు అనుమానం వచ్చి ట్యాంక్‌లోని పెట్రోల్‌ను బయటకు తీయగా అందులో అధిక శాతం నీరు ఉండడం గమనించారు. దీంతో వారు బంక్ యజమాని వద్దకు వెళ్లి వాదనకు దిగారు. ఈ క్రమంలో వాహనదారులు అధిక సంఖ్యలో రావడంతో వాహనానికి అయిన నష్టం భరిస్తామని బంక్ నిర్వాహకులు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పెట్రోల్ బంక్‌లో ఉన్న ఆరు భూగర్భ ట్యాంక్‌ల్లోని ఒకదాంట్లో నీరు చేరిందని, అందులో పెట్రోల్ పోసుకున్న వాహనాలు ఆగిపోతున్నాయని అక్కడ సిబ్బంది చెప్పినట్లు వాహనదారులు తెలిపారు. భూగర్భ ట్యాంక్‌లో చేరిన వరదనీటిని బంక్ సిబ్బంది పంపింగ్ ద్వారా బయటకు పంపడం అక్కడి వారి కంటపడింది.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ ఇండియా ప్రదర్శన



సందర్శకుల సందడి

బంజారాహిల్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి సీజన్ మొదలైంది. సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండేందుకు సంప్రదాయం ఉట్టిపడేలా ఫ్యాషనబుల్‌గా ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ ఇండియా సహజ నారపట్టు ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన మరో మూడు రోజులు కొనసాగుతుందని చెప్పారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఖైరతాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) స్థాపించి 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా ఖైరతాబాద్ చంద్రశేఖర్ ప్రభాత్ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యేష్ఠ కార్యకర్త కాటం నరసింహ యాదవ్ మాట్లాడుతూ శత జయంతి సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఎన్నో కార్యక్రమాలు చేయనున్నదన్నారు. ర్యాలీ తుమ్మలబస్తీ నుంచి చింతలబస్తీ, వీర్‌నగర్, ప్రేమ్‌నగర్ మీదుగా ఆనంద్‌నగర్‌కాలనీ వరకు సాగింది. అతిథిగా చిరంజీవులు హాజరుకాగా పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడి

పంజాగుట్ట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న లంబాడీలపై అసత్య ప్రచారం చేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు, మాజీ ఎంపీ సోయం బాపురావును కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రిలోపు నిర్ణయం తీసుకుని ప్రకటించాలని, లేనిపక్షంలో ఈనెల 22న జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని వేలాదిమందితో కలిసి ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ రవీందర్ నాయక్ రాష్ట్ర ఇన్‌చార్జి రోహిత్ నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు భరత్ నాయక్, ప్రవీణ్ నాయక్, వినోద్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ పరిజ్ఞానంపై అవగాహన

బేగంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టెలీ మెడిసన్ సొసైటీ ఆఫ్ ఇండియా, మహేశ్వరం వైద్య కళాశాల ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 'ఆరోగ్యరంగంలో వస్తున్న మార్పులు- ఏఐ' వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన సదస్సు సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాలలో శనివారం జరిగింది. సదస్సును ఈఎస్ఐసీ వైద్య కళాశాల డీన్ డాక్టర్ శిరీష, సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక తదితరులు ప్రారంభించారు. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక మార్పులు తదితర అంశాలపై సదస్సులో వైద్య, విజ్ఞాన, ఇంజనీరింగ్ రంగాల నిపుణులు చర్చించారు. కార్యక్రమంలో మహేశ్వరం వైద్య కళాశాల సీనియర్ డైరెక్టర్ డాక్టర్ బి.వి.కృష్ణారావు, టెలి మెడిసన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ కోశాధికారి కె.ఉమామహేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు పేదలకు చేయూతనివ్వాలి



కళ్లద్దాలను అందజేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంక్షేమ సంఘాలు ముందుకు రావాలని మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొంతకాలంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాలలో కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. శనివారం ఎర్రగడ్డ రాజీవ్ నగర్‌లోని గ్రౌండ్‌లో వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఏకేవై ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మాజీ ఎంపీ, ఏకేవై ఫౌండేషన్ చైర్మన్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏకేవై ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భవానీశంకర్, నిజాముద్దీన్, మురళిగౌడ్, సంజయ్‌గౌడ్, మొహసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, దూడల రవిగౌడ్, బి.అశోక్, ఆకాష్ పాల్గొన్నారు.

నాలా ఆక్రమించి అపార్ట్‌మెంట్ నిర్మాణం

● విచారణ చేపట్టిన లోకాయుక్త

బంజారాహిల్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాలా ఆక్రమించి ప్రభుత్వ భూమిలో అపార్ట్‌మెంట్ నిర్మించారనే ఫిర్యాదు మేరకు శనివారం లోకాయుక్త అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 భాగ్యనగర్ స్టూడియో స్థానంలో రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ నాలుగు బ్లాక్‌లలో బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టింది. స్టూడియో కూలుస్తుండగానే ప్రభుత్వ స్థలం కూడా ఆక్రమణకు గురవుతుందని కె.వెంకన్న, రామచందర్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం జీహెచ్ఎంసీకి అనుమతి ఇవ్వద్దంటూ పిటీషన్ పెట్టారు. రెండు విభాగాల అధికారులు పట్టించుకోకపోవడంతో నాలా ఆక్రమించి నిర్మాణాలు జరిగాయంటూ వారు లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ మేరకు లోకాయుక్త ఎస్పీ ఎండీ ఇస్మాయిల్ బృందం శనివారం విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఆక్రమణకు గురైన స్థలాన్ని షేక్‌పేట రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలా పరీవాహక ప్రాంతం ఎంత మేర ఉంది, ప్రభుత్వ స్థలం ఎంత ఉంది అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిటీషనర్లు చెప్పిన విషయాన్ని రికార్డు చేశారు. ఈ మొత్తం ప్రక్రియపై లోకాయుక్త నివేదిక రూపొందించనున్నది. లోకాయుక్తతో పాటు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాలాపై ఆక్రమణలను తొలగించాలి : తలసాని



గాయత్రీ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాలాపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన గాయత్రీ నగర్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన నాలా మోడలింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాలా పనులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోందని, వర్షాలు కురిస్తే తమకు ఇబ్బందులు తప్పడం లేదని ఎమ్మెల్యేకు స్థానికులు చెప్పారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల నాలా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. స్థానికంగా ఉన్న నాలాల్లో పూర్తిస్థాయిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, డీసీ జయంత్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మన్సూర్, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ డీజీఎం శ్రీనివాసులు, స్ట్రీట్ లైట్ డీఈ దీప్తి, బీఆర్ఎస్ నాయకులు హన్మంతరావు, అశోక్ యాదవ్, సంతోష్ కుమార్, ప్రవీణ్‌రెడ్డి, పీయూష్ గుప్తా, వనం శ్రీనివాస్, కట్టా బలరాం పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తుల వినియోగం పెంచాలి : కొండా



సదస్సులో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధులు, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు

బంజారాహిల్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి దిగుమతులు తగ్గించుకొని స్వదేశీ వస్తువుల వినియోగం పెంచగలిగినప్పుడే భారతదేశం స్వయం సమృద్ధిని సాధించగలుగుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం రీజినల్ వైస్ ప్రెసిడెంట్ బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో స్వదేశీ వస్తువుల వినియోగం పెంపు, జీఎస్టీ సరళీకరణ, ప్రభుత్వంపై పడుతున్న భారం తదితర అంశాలపై వివిధ పారిశ్రామిక, వ్యాపారవర్గాల ప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల అమెరికా విధిస్తున్న సుంకాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు స్వదేశీ ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం మరింత పెరిగిందన్నారు. ఈ అంశాలపై పరిశ్రమ పెద్దలు, వ్యాపారులు, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు నివేదిక అందజేయనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులు బొల్లంపల్లి ఇంద్రసేన్ రెడ్డి మాట్లాడుతూ సదస్సులో వచ్చిన సూచనలను కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. తద్వారా రానున్న రోజుల్లో కొత్త సంస్కరణలు, ప్రోత్సాహకాలు రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధార్థశర్మ, స్వదేశీ జాగరణ మంచ్ నేషనల్ కన్వీనర్ సుందరం, ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ కశ్మీర్ లాల్, ఆలిండియా కో-ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ కుమార్, నేషనల్ కో-కన్వీనర్ ప్రొఫెసర్ అశ్విని మహాజన్, నేషనల్ కో-కన్వీనర్ భగవంతు ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారులకు పునర్జన్మనిచ్చిన 'నిమ్స్'

● 22 గుండె ఆపరేషన్లు విజయవంతం



ఆపరేషన్ చేసిన పిల్లలతో డాక్టర్ బీరప్ప, బ్రిటన్ వైద్యుడు రమణ దన్నపనేని, డాక్టర్ అమరేశ్వరరావు

నిమ్స్,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 22 మంది చిన్నారులకు పునర్జన్మనిచ్చారు. బ్రిటన్ వైద్యబృందంతో కలిసి నిమ్స్ వైద్యులు క్లిష్టమైన గుండె ఆపరేషన్‌లు ఈనెల 15 నుంచి 20 వరకు విజయవంతంగా నిర్వహించారు. బ్రిటన్‌లో చిన్నపిల్లల వైద్యుడు రమణ దన్నపునేని, నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరావు బృందం ఆధ్వర్యంలో గుండె సంబంధ శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. శనివారం నిమ్స్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో బ్రిటన్ వైద్యులను నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. బ్రిటన్ వైద్యుడు రమణ దన్నపునేని, నిమ్స్ కార్డియోథొరాసిక్ వైద్యుడు అమరేశ్వరరావు ప్రసంగించారు.

వివరాలు ఇలా..

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన శ్రీనివాస్, శారద దంపతుల కుమార్తె తన్విక(5)కు, పరిగికి చెందిన రమేష్ కుమారుడు రిషికేష్(5)కు, గద్వాల జిల్లా తూముళ్లపల్లికి చెందిన ఏడాది వయసున్న లక్ష్మీనరసింహకు, గద్వాల్ జిల్లా సెట్ల ఆత్మకూర్‌కు చెందిన సంధ్యారాణి తదితర చిన్నారులకు విజయవంతంగా గుండె ఆపరేషన్లు చేశారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బంజారాహిల్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు శనివారం ఆయనను కలిసి సమస్యలపై తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు.



చిన్నారులతో స్కూల్ నిర్వాహకులు మోహన వంశీ, మధుమతి

సంస్కార్ ది లైఫ్ స్కూల్లో దసరా వేడుకలు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్లో దసరా వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు దుర్గామాత, వివిధ వేషధారణల్లో ప్రత్యేకంగా అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ మోహనవంశీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతీ పండగ విశిష్టతను తెలియజేసేందుకు అన్ని పండుగలను స్కూల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి ఉన్నత పాఠశాలలో జరిగిన బతుకమ్మ, దసరా వేడుకలలో భాగంగా దేవీ శరన్నవరాత్రుల గురించి నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు. ఈ వేడుకలో డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి

మారువేషంలో స్నేహితుడి ఇంట్లో చోరీ

● సీసీ కెమెరాలకు చిక్కిన సీసీ కెమెరాల నిపుణుడు



హర్షిత్

బంజారాహిల్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ పెరిగింది. వాటి నుంచి బయటపడేందుకు స్నేహితుడి ఇంట్లో చోరీ చేయాలని భావించాడు. పోలీసులకు చిక్కకుండా మహిళగా మారువేషం వేసుకొని వచ్చి తాళాలు పగలకొట్టి నగలు, డబ్బును చోరీ చేశాడు. సీసీ కెమెరాల నిపుణుడు కావడంతో తన కదలికలు కెమెరాల్లో తొలగించేందుకు చేసిన ప్రయత్నం పోలీసులకు పట్టించింది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్‌కు చెందిన శివరాజ్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లో నివాసం ఉంటున్నాడు. జీవీకే చౌరస్తాలో పానీపూరి బండి నడిపిస్తుంటాడు. బంధువులకు ఆరోగ్యం బాగోలేదని కబురు రావడంతో ఈనెల 14న ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా నిజామాబాద్‌కు వెళ్లాడు. 18న తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇల్లంతా చిందరవందరగా ఉంది. అల్మారాలో ఉన్న ఎనిమిది బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 లక్షల నగదు చోరీకి గురయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు.

అరెస్ట్.. రిమాండ్



యువతి వేషంలో హర్షిత్

కెమెరాల్లో శివరాజ్ ఇంటికి ఓ ఆడమనిషి వచ్చి వెళ్లినట్టు కనిపించింది. ముఖం సరిగ్గా కనిపించలేదు. దీంతో మరిన్ని కెమెరాలను పరిశీలించారు. కాగా, సంఘటనా స్థలానికి సమీపంలోని ఓ వ్యాపార సంస్థలో ఉన్న కెమెరాలు చూసేందుకు పోలీసులు వెళ్లారు. అప్పటికే ఓ యువకుడు పోలీస్ అని చెప్పి పరిశీలించాడని వ్యాపారి చెప్పాడు. అనుమానం వచ్చిన యువకుడి గురించి ఆరా తీయగా శివరాజ్ కుమారుడి స్నేహితుడైన లింగంపల్లి చెందిన హర్షిత్ మహిళగా వేషం వేసుకొని వచ్చినట్లు గుర్తించారు. శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆరోగ్య వ్యవస్థ మెరుగుదలకు దార్శనిక నాయకత్వం అవసరం : గవర్నర్ జిష్ణుదేవ్



డాక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డును అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బంజారాహిల్స్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ఆరోగ్య వ్యవస్థ మరింత మెరుగుపడాలంటే దార్శనిక నాయకత్వం కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ ఇండియా(ఏహెచ్‌పీఐ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో 'హైటెక్ హెల్త్‌కేర్ యుగంలో నాయకత్వం' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు రెండోరోజైన శనివారంతో ముగిసింది. చివరి రోజున ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డు అందజేశారు. ఆరోగ్య సంరక్షణలో సేవా భావం ముఖ్యమని, ఈ రంగాన్ని వ్యాపార ధోరణితో చూడవద్దన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అలెగ్జాండర్ థామస్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఐ. సహదుల్లా, హెల్త్ పాలసీ కమిటీ చైర్మన్ విశాల్ బాలి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిర్ధర్ గ్యాని పాల్గొన్నారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

● 585 మందు బాటిళ్లు స్వాధీనం.. విలువ రూ. 21.80 లక్షలు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీ) కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వివిధ ప్రాంతాల్లో శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఇందులో రూ. 21.80లక్షల విలువైన 585 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. పహాడీషరీఫ్ పరిధిలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్‌తో పాటుసీఐలు సుభాష్ చందర్, బాలరాజులు, ఎస్సై ప్రత్యేక టీమ్‌గా రంగంలోకి దిగి వాహనాల తనిఖీలు చేసి గోవా, ఢిల్లీ, హర్యానా నుంచి విచ్చలవిడిగా సరఫరా అవుతున్న 449 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. ధూల్‌పేట్‌లో హైదరాబాద్ డీటీఎఫ్ సీఐ శిరిష, ధూల్‌పేట్ సీఐ గోపాల్ సిబ్బంది కలిసి 72 మద్యం బాటిళ్లను ఒక ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. తన సిబ్బందితో కలిసి సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య టీమ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 47 మద్యం బాటిళ్లను, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై చంద్రాకాంత్ సిబ్బంది పిస్తా హౌస్ ప్రాంతంలో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. మొత్తం 136 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు.

నేటి నుంచి రాజీవ్ గాంధీ చాలెంజర్స్ సిరీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాజీవ్ గాంధీ చాలెంజర్ సిరీస్ ఉప్పల్ స్టేడియంలో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా క్రీడా మంత్రి వాకిటి శ్రీహరిని డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (డీఏసీఏహెచ్) ఆహ్వానించింది. సచివాలయంలో శ్రీహరిని డీఏసీఏహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

శేషుబాబు, శిరీష స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గాయని మర్సుకోల కళావతికి తోట శేషుబాబు, యువ కవి సల్వాది గోవర్ధన్‌కు దాసరి శిరీష పురస్కారాలను నిర్వాహకురాలు అపర్ణ తోట ప్రదానం చేశారు. శనివారం బంజారాహిల్స్ లామకాన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రచయిత్రి అపర్ణ తోట యేటా తన తల్లిదండ్రులు దాసరి శిరీష, తోట శేషుబాబు స్మారకంగా ప్రత్యామ్నాయ కళా, సాహిత్య రంగాలలో పని చేస్తున్న వారిని గుర్తించి పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని సాహిత్య విమర్శకుడు ఏకే ప్రభాకర్ అన్నారు. సల్వాది గోవర్ధన్ రాసిన "మా అమ్మ కట్టెలకి పోయింది - నేనైతే గుడ్డోన్ని" కవితా సంపుటిని సినీ రచయిత్రి పింగళి చైతన్య పరిచయం చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిది

మంత్రి జూపల్లి కృష్ణారావు



ముషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మగ్దూమ్ భవన్.. రాజ్ బహదూర్ గౌర్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి నిర్వహిస్తున్న మాదకద్రవ్యాలతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించే కళారూపాల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రజానాట్య మండలి నాటక బృందం మాదకద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ తదితరులు పాల్గొన్నారు

నాటకీయతకు ఆధునిక రూపం.. చంద్రశేఖర్ కథలు

సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్



మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రచయిత చంద్రశేఖర్ కథలు నాటకీయతను ఆధునిక రూపంలో పరిచయం చేశాయని సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. నాటక రంగానికి చెందిన రచయితగా పేరు సంపాదించి విభిన్న రూపంలోని కథలను పొందుపరిచారన్నారు. శనివారంరాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండ్ల చంద్రశేఖర్ రచించిన మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చంద్రశేఖర్ భిన్నమైన కథలను సేకరించారని అన్నారు. చంద్రశేఖర్ రచించిన మరో కథల పుస్తకం బొర చెక్క పుస్తకాన్ని కవి సిద్ధార్థ ఆవిష్కరించి మాట్లాడారు. కథలు ఎంత బాగా చదివితే కవిత్వం అంతా బాగా ఉంటుందన్నారు. ఆవిష్కరణ సభకు ప్రముఖ రచయిత కోయి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాంచంద్రరెడ్డి, ఆదిత్య కొర్రపాటి, కథల పుస్తకాల రచయిత ఇండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నియామకంపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకంపై కోర్టుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం.. రాజ్యాంగపరమైన అవకతవక అని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన, బైండింగ్ ఆదేశాలున్నప్పటికీ ఇప్పటివరకు నియామక ప్రక్రియపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొంది. ఇది కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం "న్యాయవ్యవస్థ అధికారం, న్యాయపాలనపై దెబ్బ" అని సోషల్ జస్టిస్ డైరెక్టర్, జాతీయ అధ్యక్షుడు హిదాయత్ అలీ మిర్జా, డైరెక్టర్, చైర్మన్ షబ్బీర్ అలీ మీర్జాలు తెలిపారు.

ఒక్కరోజు శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీ, ప్రొఫెషనల్ మెలకువలపై 20 మంది ఉద్యోగార్థులకు జీహెచ్ఎంసీలో శనివారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. క్వియర్ బంధు అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బీ) సహకారంతో వివిధ నైపుణ్యానికి సంబంధించిన అంశాల గురించి తెలిపారు. శిక్షణ పొందిన 20 మందిలో ఆరుగురికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (హెల్త్, ఎన్‌యూహెచ్‌ఎం) పంకజా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వ్యవస్థ మెరుగుదలకు దార్శనిక నాయకత్వం అవసరం: గవర్నర్ జిష్ణుదేవ్



డాక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డును అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బంజారాహిల్స్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ఆరోగ్య వ్యవస్థ మరింత మెరుగుపడాలంటే దార్శనిక నాయకత్వం కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ ఇండియా(ఏహెచ్‌పీఐ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో 'హైటెక్ హెల్త్‌కేర్ యుగంలో నాయకత్వం' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు రెండోరోజైన శనివారంతో ముగిసింది. చివరి రోజున ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డు అందజేశారు. ఆరోగ్య సంరక్షణలో సేవా భావం ముఖ్యమని ఈ రంగాన్ని ఎప్పుడు కూడా వ్యాపార ధోరణితో చూడవద్దన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అలెగ్జాండర్‌థామస్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఐ. సహదుల్లా, హెల్త్ పాలసీ కమిటీ చైర్మన్ విశాల్ బాలి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిర్ధర్ జె. గ్యాని తదితరులు పాల్గొన్నారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

● 585 మందు బాటిళ్లు స్వాధీనం.. విలువ రూ. 21.80 లక్షలు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదారాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌పీడీ) కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వివిధ ప్రాంతాల్లో శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఇందులో రూ. 21.80లక్షల విలువైన 585 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. పహాడీషరీఫ్ పరిధిలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్‌తో పాటుసీఐలు సుభాష్ చందర్, బాలరాజులు, ఎస్సై ప్రత్యేక టీమ్‌గా రంగంలోకి దిగి వాహనాల తనిఖీలు చేసి గోవా, ఢిల్లీ, హర్యానా నుంచి విచ్చలవిడిగా సరఫరా అవుతున్న 449 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. ధూల్‌పేట్‌లో హైదరాబాద్ డీటీఎఫ్ సీఐ శిరిష, ధూల్‌పేట్ సీఐ గోపాల్ సిబ్బంది కలిసి 72 మద్యం బాటిళ్లను ఒక ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. తన సిబ్బందితో కలిసి సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య టీమ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 47 మద్యం బాటిళ్లను, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై చంద్రాకాంత్ సిబ్బంది పిస్తా హౌస్ ప్రాంతంలో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. మొత్తం 136 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. వీటి విలువ రూ. 6.80 లక్షలుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

నేటి నుంచి రాజీవ్ గాంధీ చాలెంజర్స్ సిరీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాజీవ్ గాంధీ చాలెంజర్ సిరీస్ ఉప్పల్ స్టేడియంలో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా క్రీడా మంత్రి వాకిటి శ్రీహరిని డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (డీఏసీఏహెచ్) ఆహ్వానించింది. సచివాలయంలో శ్రీహరిని డీఏసీఏహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

శేషుబాబు, శిరీష స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గాయని మర్సుకోల కళావతికి తోట శేషుబాబు, యువ కవి సల్వాది గోవర్ధన్‌కు దాసరి శిరీష పురస్కారాలను నిర్వాహకురాలు అపర్ణ తోట ప్రదానం చేశారు. శనివారం బంజారాహిల్స్ లామాకాన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రచయిత్రి అపర్ణ తోట యేటా తన తల్లిదండ్రులు దాసరి శిరీష, తోట శేషుబాబు స్మారకంగా ప్రత్యామ్నాయ కళ, సాహిత్య రంగాలలో పని చేస్తున్న వారిని గుర్తించి పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని సాహిత్య విమర్శకుడు ఏకే ప్రభాకర్ అన్నారు. సల్వాది గోవర్ధన్ రాసిన "మా అమ్మ కట్టెలకి పోయింది - నేనైతే గుడ్డోన్ని" కవితా సంపుటిని సినీ రచయిత్రి పింగళి చైతన్య పరిచయం చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిది

మంత్రి జూపల్లి కృష్ణారావు


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

ముషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మగ్దూమ్ భవన్.. రాజ్ బహదూర్ గౌర్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి నిర్వహిస్తున్న మాదకద్రవ్యాలతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించే కళారూపాల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రజానాట్య మండలి నాటక బృందం మాదకద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ పాల్గొన్నారు

నాటకీయతకు ఆధునిక రూపం.. చంద్రశేఖర్ కథలు

సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్


మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రచయిత చంద్రశేఖర్ కథలు నాటకీయతను ఆధునిక రూపంలో పరిచయం చేశాయని సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. నాటక రంగానికి చెందిన రచయితగా పేరు సంపాదించి విభిన్న రూపంలోని కథలను పొందుపరిచారన్నారు. శనివారంరాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండ్ల చంద్రశేఖర్ రచించిన మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చంద్రశేఖర్ భిన్నమైన కథలను సేకరించారని అన్నారు. చంద్రశేఖర్ రచించిన మరో కథల పుస్తకం బోర చెక్క పుస్తకాన్ని కవి సిద్ధార్థ ఆవిష్కరించి మాట్లాడారు. కథలు ఎంత బాగా చదివితే కవిత్వం అంతా బాగా ఉంటుందన్నారు. ఆవిష్కరణ సభకు ప్రముఖ రచయిత కోయి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాంచంద్ర రెడ్డి, ఆదిత్య కొర్రపాటి, కథల పుస్తకాల రచయిత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నియామకంపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకంపై కోర్టుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం.. రాజ్యాంగపరమైన అవకతవక అని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన, బైండింగ్ ఆదేశాలున్నప్పటికీ ఇప్పటివరకు నియామక ప్రక్రియపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొంది. ఇది కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం "న్యాయవ్యవస్థ అధికారం, న్యాయపాలనపై దెబ్బ" అని సోషల్ జస్టిస్ డైరెక్టర్, జాతీయ అధ్యక్షుడు హిదాయత్ అలీ మిర్జా, డైరెక్టర్, చైర్మన్ షబ్బీర్ అలీ మీర్జాలు తెలిపారు.

ఒక్కరోజు శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీ, ప్రొఫెషనల్ మెలకువలపై 20 మంది ఉద్యోగార్థులకు జీహెచ్‌ఎంసీలో శనివారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. క్వియర్ బంధు అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బీ) సహకారంతో వివిధ నైపుణ్యానికి సంబంధించిన అంశాల గురించి తెలిపారు. శిక్షణ పొందిన 20 మందిలో ఆరుగురికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (హెల్త్, ఎన్‌యూహెచ్‌ఎం) పంకజా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ముస్తాబవుతున్న మండపాలు

● వేడుకలకు ఏర్పాట్లు


నవరాత్రులకు సిద్ధమైన దుర్గామాత మండపంలోని అమ్మవారు


బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం

బోయినపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాలు 22 నుంచి ఘట స్థాపనతో మొదలై అక్టోబరు 2 విజయదశమి వేడుకతో ముగుస్తాయి. ఈ సమయంలో తొమ్మిది రోజులు దుర్గాదేవి అవతారాలను పూజిస్తారు. ఈ నేపథ్యంలో దసరా నవరాత్రులకు బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద టింకు గౌడ్ ఆధ్వర్యంలో దుర్గామాత మండపం ముస్తాబవుతోంది. దసరా నవరాత్రులను ఇక్కడ గొప్ప ఉత్సాహంగా జరుపుకుంటారు. నవరాత్రులు పదవ రోజున చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా ఉత్సవాలను జరుపుకుంటారు. దసరా పండుగ రోజు కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున రావణ సురవధని నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ సందర్భంగా బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున దుర్గామాత మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నుంచి బోయినపల్లి పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వరకు విద్యుత్ దీపాలతో స్వాగతతోరణాలను ఏర్పాటు చేశారు. భక్తులకు నిత్యం ప్రసాదాలు అందజేయడానికి ఏర్పాటు చేస్తున్నారు. దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. నవరాత్రులకు ఇంకా ఒక రోజు సమయం మాత్రమే ఉండటంతో పనులు శరవేగంగా చేస్తున్నారు.

భక్తులకు పెద్దపీట



ప్రతి ఏడాది దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. దసరా వచ్చిందంటే చాలు నవరాత్రుల్లో వేలసంఖ్యలో భక్తులు దుర్గమ్మను సందర్శించుకుంటారు. తొమ్మిది రోజుల పాటు రోజుకో అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశాం.

- టింకు గౌడ్

భారీ బందోబస్తు



దసరా నవరాత్రి వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తూ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. భక్తులు, నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ వేడుకలు ప్రశాంతగా జరుపుకోవాలి.

- తిరుపతి రాజు, ఇన్‌స్పెక్టర్


బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో చర్చిస్తున్న తలసాని

వరద బాధితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

● నేడు 1,500 కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

సికింద్రాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్‌మారేడుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి బీఆర్‌ఎస్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి బాసటగా నిలుద్దామని పిలుపునిచ్చారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కాచిబౌలి, నల్లగుట్ట, జూలమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపునీరు చేరి, తీవ్రంగా నష్టపోయిన వారికి అండగా ఉంటామని తెలిపారు. 21న ఉదయం 9 గంటల నుంచి ఆయా ప్రాంతాల్లో 1,500 బాధిత కుటుంబాలకు బియ్యం, పప్పు, నూనె తదితర నిత్యావసరాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు.


బ్రోచర్ విడుదల చేస్తున్న గుత్తా మనోహర్‌రెడ్డి తదితరులు

రేపటి నుంచి మహాకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు

సికింద్రాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త సురిటి రామేశ్వర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. 22 నుంచి వచ్చే నెల 2 వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రతి రోజూ ఒక్కో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని, ప్రతి రోజూ ఉదయం 9.30గంటలకు అలంకార దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. 30వ తేదీన ఆలయ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన వివరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, తాగునీరు ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.

పాఠశాలల్లో సదుపాయాలకు ప్రాధాన్యం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

తిరుమలగిరి సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఇటీవల 7వ వార్డు లాల్‌బజార్ ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అతి త్వరలోనే పాఠశాలలో కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం మొదటి విడతగా రూ.20 లక్షలను మంజూరు చేయించిన ఎమ్మెల్యే శనివారం పాఠశాలకు వెళ్లి మౌలిక వసతుల ఏర్పాటుకు ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా నిలపడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగనేని సరిత, మురళీ ముదిరాజ్, భవాని తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకు హారతిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ పి. జ్యోతి

విద్యార్థులకు సంప్రదాయాలను తెలియజేయాలి

● పి.జ్యోతి మధుసూదన్‌రావు

మారేడుపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి, ఆచార వ్యవహారాలు అందజేయడంలో పెద్దపీట వేశామని సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాడెంట్ పి. జ్యోతి మధుసూదన్‌రావు అన్నారు. శనివారం రాత్రి స్కూల్ ఆవరణలో మన తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ, దసరా నవరాత్రుల్లో భాగంగా కోలాటం, ఆటల కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పాఠశాల ఆవరణలో పెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్కూల్ కరస్పాండెంట్ పి. జ్యోతి, ప్రిన్సిపాల్ జె. సుజాత, ఉపాధ్యాయులు పాల్గొని కన్నుల పండువగా ఉత్సవాలను నిర్వహించారు. దీంతో స్కూల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ఉత్సవ వేడుకలు విద్యార్థులకు, గురువులకు మానసిక ఉల్లాసాన్ని అందించడమే కాక మన సంప్రదాయాలను తెలియజేసేవిధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

మర్యాదపూర్వక కలయిక



నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ నూతన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మర్రి రాఘవయ్యని చిలకలగూడ ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో శనివారం మర్యాద్య పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపిన పెన్షనర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ జాయింట్ జనరల్ సెక్రటరీ ఎ.జి.కె. మూర్తి.

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి



బతుకమ్మ వేడుకలు

సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డులోని జీరాలో గల గుజరాతి హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, సిబ్బంది.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

ఒడిశా టు మహారాష్ట్ర వయా సికింద్రాబాద్

● గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు
● రైల్వేస్టేషన్‌లో 38 కిలోల సరుకు స్వాధీనం
● పరారీలో ఇరువురు



గంజాయి నిందితుడిని చూపుతున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇరువురు పరారీలో ఉన్నారు. శనివారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన అలు సిబా (30) అనే వ్యక్తి స్థానికంగా బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బిక్రమ్‌తో అతనికి పరిచయం ఉంది. ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలించేలా సిబా, బిక్రమ్‌లతో ఇద్దరు వ్యక్తులు ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండోసారి 19 ప్యాకెట్లతో కూడిన 38 కిలోల గంజాయిని మహారాష్ట్రకు తీసుకెళ్తూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బిక్రమ్, మైనర్ దిగి వెయిటింగ్ హాలులో ఉన్నారు. శనివారం సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సర్వసత్, జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎస్సై రమేష్‌లతోపాటు కానిస్టేబుళ్లు రైల్వే పోలీసులు సాధారణ తనిఖీల్లో గంజాయితో ఉన్న ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 19 లక్షలు విలువ చేసే 38 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిబాను అరెస్టు చేసి, మైనర్‌ను జువెనల్ హోంకు తరలించారు. పరారీలో మరో ఇద్దరు ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్ ఫ్రైడే మార్కెట్ వర్ష ప్రభావిత ప్రాంతంలో శనివారం స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ, అధికారులతో కలిసి పర్యటించారు. నిత్యావరాలు, విలువైన వస్తువులు వరదనీటిలో కొట్టుకుపోయాయని మహిళలు కార్పొరేటర్ వద్ద మొర పెట్టుకున్నారు. వరద బాధిత కుటుంబాలను కలిసిన ఆమె ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్రైడేమార్కెట్, మహ్మద్‌గూడ, అన్నానగర్ ప్రాంతాల్లో నాలా అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలో రూ.9 కోట్ల 95 లక్షల ప్రతిపాదనలు పెట్టామని, నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రభుత్వం చేపట్టలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ మేయర్ స్పందించి నాలా పనులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేటర్ తన నివాసంలో రెవిన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకి మెట్టుగూడ డివిజన్ విజయపురి కాలనీలో ఇళ్లల్లోకి నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్న వారికి కార్పొరేటర్ రాసూరి సునీత శనివారం తన సొంత నిధులతో నిత్యావసరాలు అందజేశారు. అనంతరం వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.


బౌద్ధనగర్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కంది శైలజకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెన్షన్ల పెంపునకు నిలదీయాలి: ఎమ్మార్పీఎస్

బౌద్ధనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పెంపుకోసం ప్రభుత్వాన్ని కార్పొరేటర్లు నిలదీయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) నాయకులు కోరారు. శనివారం బౌద్ధనగర్ మున్సిపల్ వార్డు కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కంది శైలజను నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. సీఎం పెన్షన్‌దారులకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని, తక్షణమే పెన్షన్లు పెంచాలని ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షురాలు నాగమణి, నాయకులు రుద్రమాదిగ, దేవేందర్‌మాదిగ, హరి తదితరులు పాల్గొన్నారు

బతుకమ్మ సంబురాలు



సీతాఫల్‌మండి బ్రాహ్మణబస్తీలో ఉజ్జయినీ స్కూలులో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, నిర్వాహకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి

బోయినపల్లి మార్కెట్‌ను సందర్శించిన విదేశీ ప్రతినిధులు

● కూరగాయల క్రయవిక్రయాల పరిశీలన

సికింద్రాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదిహేను దేశాలకు చెందిన ప్రతినిధులు శనివారం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతులకు హాజరవుతున్న ఈ ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించారు. ఉగాండా, శ్రీలంక, దక్షిణాఫ్రికా, జాంబియా, నైజీరియా, థాయిలాండ్, ఇథోపియా, కెన్యా, ఇరాన్, ఫిజీ, జింబాబ్వే, టాంజేనియా తదితర దేశాలకు చెందిన ప్రతిధులు మార్కెట్‌లో కూరగాయల లావాదేవీలను, కొనుగోలు, విక్రయాలు తదితర కార్యకలాపాలను ఆసక్తిగా తిలకించారు. మార్కెట్ ఆవరణలోని బయోగ్యాస్ కేంద్రాన్ని పరిశీలించారు. బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగీరు ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకన్న తదితరులు విదేశీ ప్రతినిధులకు మార్కెట్ కార్యకలాపాల గురించి వివరించారు.

రైల్వేస్టేషన్‌లో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి బడులకు సెలవు రావడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. సికింద్రాబాద్ నుంచి బిహార్‌కు వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 9 గంటలకు బయలుదేరాల్సి ఉండగా ఉదయం ఆరు గంటలకే ప్రయాణికులు క్యూ కడుతున్నారు. సికింద్రాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపునకు వెళ్లే గౌతమీ, విశాఖపట్నం, శాతవాహన, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రిజర్వేషన్ టికెట్లు దొరకపోవడంతో జనరల్ బోగిలో ప్రయాణం చేస్తున్నారు. ఒక వైపు రిజర్వేషన్ బోగిలో సాధారణ ప్రయాణికులు ఎక్కడకుండా ఆర్పీఎఫ్ పోలీసులు క్యూ పద్ధతిన రైలు ఎక్కిస్తున్నారు.

ట్రక్కు ఢీకొని వృద్ధుడు మృతి



బోయినపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి కోకాపేట వెళుతున్న సౌత్ సెంట్రల్ రైల్వేకు చెందిన భారీ వాహనం నుంచి పడిపోయిన 2 క్రేన్ కన్వర్లను ఢీకొన్న 65 సంవత్సరాల గుర్తు తెలియని వృద్ధుడు శనివారం మృతి చెందిన ఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బోయినపల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి ఎక్స్‌రోడ్ నుంచి బాలానగర్ వైపు వెళుతున్న భారీ వాహనం ఆజామ్ హోటల్‌కు చేరుకుంటుండగా ఆ వాహనం నుంచి 2 క్రేన్ కన్వర్లు రోడ్డుపై పడిపోయాయి. అవి గుర్తు తెలియని వ్యక్తికి నుదుట, మెడపై తగిలి తీవ్రగాయాలు కావడంతో వెంటనే గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం బాలానగర్‌లోని బీబీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తిని పరీక్షించిన వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో అతడిని పరీక్షించిన డాక్టర్లు మరణించినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని గుర్తించడానికి గాంధీ మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే యార్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతి


రాజేందర్ సింగ్(ఫైల్)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మౌలాలి రైల్వే యార్డులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మౌలాలి రైల్వే యార్డులో 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని డిప్యూటీ స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడు రజాస్తాన్ రాజేందర్ సింగ్ అని తెలిసిందని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.